సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



బోధనలు ఆచరణీయం
ఆచార్య నాగార్జునుడి బోధనలు ఆచరణీయమని ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ శివనాగిరెడ్డి అన్నారు. - 8లో



మూసీకి పోటెత్తిన వరద
ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీ, బిక్కేరు వాగుల ద్వారా మూసీ ప్రాజెక్టుకు వరద పెరిగింది. - 8లో



సమస్యలు పరిష్కరించాలి
సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేసి వినతిపత్రాలు అందజేశారు. - 9లో

ముంచెత్తిన వరద

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- భువనగిరి–చిట్యాల మార్గంలో రోజంతా నిలిచిన రాకపోకలు, పునరుద్ధరణ
- నాన్ ఆయకట్టులోనూ అలుగుపోస్తున్న చెరువులు



నాగిరెడ్డిపల్లి వద్ద రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు, బుధవారం నిలిచిపోయిన వాహనాలు



బొమ్మలరామారం మండలం మైలారం వద్ద నిండుగా పారుతున్న షామీర్‌పేట్ వాగు

సాక్షి,యాదాద్రి : జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భువనగిరిలోని జంఖానగూడెంలో ఇళ్ల మధ్యకు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వాగులు పొంగిపొర్లుతున్నాయి. నాన్ ఆయకట్టులో చెరువులు అలుగుపోస్తున్నాయి. రోడ్లపై భారీగా వరద చేరడంతో చెరువులను తలపించాయి.

భువనగిరి నియోజకవర్గంలో..
- భువనగిరి మండలం అనాజిపురం–బీబీనగర్ మండలం రావిపహాడ్ మధ్య చిన్నేటి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.
- బీబీనగర్, భువనగిరి పెద్ద చెరువులు, తీనం చెరువు జలకళను సంతరించుకున్నాయి. బీబీనగర్ వద్ద సర్వీస్ రోడ్డు వెంట చిన్నేటి వాగు వరద ప్రవాహానికి రాకపోకలు నిలిపివేశారు.
- బీబీనగర్ మండలం అన్నంపట్ల–గూడూరు మధ్య రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.
- మూసీ బ్రిడ్జిలు సంగెం, రుద్రవెల్లి వద్ద బుధవారం రాకపోకలను నిలిపివేశారు. తిరిగి గురువారం పునరుద్ధరించారు.

ఆలేరు నియోజకవర్గ పరిధిలో..
- యాదగిరిగుట్ట పట్టణంలో గండి చెరువు అలుగుపోస్తోంది.అధికారులు చెరువు గేట్లు ఎత్తి యాదగిరిపల్లి ఎస్సీ కాలనీ పక్క నుంచి వంగపల్లి వాగులోకి నీటిని పంపుతున్నారు.
- వర్షం కారణంగా యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి భక్తుల రాక తగ్గింది.
- గుండ్లపల్లిలో తోపుగాని చెరువు అలుగుపోస్తుంది.
- యాదగిరిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు మార్గం కుంగిపోయింది.
- యాదగిరిగుట్ట నుంచి రాజాపేటకు వెళ్లే మార్గంలోని సైదాపురం వాగు, చొల్లేరు–మగ్రిగూడెం మధ్యలో వాగులు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. పోలీసులు అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు.
- దాతారుపల్లిలో చెరువుకట్టపై గండి ఏర్పడటంతో అధికారులు అప్రమత్తమై పూడ్చివేశారు.
- ఆలేరు పట్టణ పరిధిలోని పెద్ద వాగు జలకళను సంతరించుకుంది.
- రాజాపేట మండలం కాల్వపల్లి–పొట్టిమర్రి వద్ద వాగు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలను నిలిపివేసి, రఘునాథపురం–వెంకటపురం మధ్య మార్గం నుంచి వాహనాలను మళ్లించారు.
- రాజాపేట మండల పరిధిలో చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి.
- తుర్కపల్లి మండలం గంథమల్ల చెరువు నిండి మత్తడి దుంకుతుంది.
- ఆలేరు మండలం కొలనుపాక వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆలేరు నుంచి బచ్చన్నపేట, సిద్దిపేట వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి.
- ఆలేరు నుంచి జనగాం మీదుగా వాహనాలు సిద్దిపేట వైపు వెళ్తున్నాయి.
- బొమ్మలరామారం మండలం చౌదరిపల్లి మల్లారెడ్డి చెరువు అలుగుపోస్తుండటంతో మర్యాల గ్రామంలో కల్వర్టు ప్రాంతమంతా కోతకు గురైంది. దీంతో అక్కడి నుంచి పలు గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయి గురువారం నుంచి పునఃప్రారంభం అయ్యాయి.

నాగిరెడ్డిపల్లి వద్ద 24 గంటలు నిలిచిన రాకపోకలు

ఈనెల 26వ తేదీ రాత్రి నుంచి 27 వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల భువనగిరి–నల్లగొండ మార్గంలో యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామం వద్ద రోడ్డు మీదుగా ఉధృతంగా వరద నీరు ప్రవహించింది. దీంతో పోలీసులు సుమారు 24 గంటల పాటు ఈ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఇరువైపులా సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో పోలీసులు కొన్ని వాహనాలను నాగిరెడ్డిపల్లి, ఎర్రంబెల్లి, గౌస్‌నగర్, తుక్కాపురం మీదుగా రాకపోకలకు అవకాశం కల్పించారు. తిరిగి గురువారం ఉదయం 11 గంటల సమయంలో భారీ వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అలాగే భువనగిరి మండలంలోని అనాజీపురం–బీబీనగర్ మండలంల రావిపహాడ్ గ్రామాల మధ్య చిన్నేటి వాగు ప్రవహించడంతో రాకపోకలునిలిచిపోయాయి. బొల్లేపల్లి గ్రామం మధ్య నుంచి వెళ్లే చిన్నేటి వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రెడ్ అలర్ట్..
జిల్లాలో మూడు రోజులుగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజులువర్షాలు కురిసే అవకాశం ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. లో లెవల్ బ్రిడ్జిల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసింది.

26 రాత్రి నుంచి 28వ తేదీ ఉదయం వరకు నమోదైన వర్షపాతం
26వ తేదీ రాత్రి నుంచి 27 ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 66.3 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. అధికంగా భువనగిరిలో 19 సెం.మీ, యాదగిరిగుట్టలో 13 సెం.మీ, తుర్కపల్లిలో 9 సెం.మీ, వలిగొండలో 9 సెం.మీ వర్షపాతం నమోదైంది. 27నుంచి 28వ తేదీ ఉదయం వరకు 27 సెం.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రాజాపేటలో 8 సెం.మీ, తుర్కపల్లి 5 సెం.మీ, ఆలేరు 5 సెం.మీ, భువనగిరిలో 4 సెం.మీ వర్షం కురిసింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



కొలనుపాక వాగును పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

ఆలేరురూరల్, భువనగిరి : భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. గురువారం ఆలేరు మండలంలోని కొలనుపాక, గొలనుకొండ, భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి వద్ద రోడ్డుపైనుంచి ప్రవహిస్తున వరద నీటిని పరిశీలించారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, రోడ్లపైనుంచి వరద నీరు ప్రవహిస్తున్నందున ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు, రెవెన్యూ, నీటిపారుదల శాఖల యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజేయులు, డిప్యూడి తహసీల్దార్ ప్రదీప్ తదితరులు ఉన్నారు.



భువనగిరిలో కోర్టు పక్కన వరద నీటితో ఏటిని తలపిస్తున్న వీధి



భువనగిరి పరిధిలోని జంఖానగూడెంలో ఇళ్ల మధ్య చేరిన వరద



చొల్లేరు వద్ద జేసీబీ సాయంతో వాగు దాటుతున్న రైతులు

న్యూస్‌రీల్

కేజీబీవీ తనిఖీ



విద్యార్థులకు బోధన చేస్తున్న జెడ్పీ సీఈఓ శోభారాణి

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలను గురువారం జెడ్పీ సీఈఓ శోభారాణి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు విద్యాబోధన చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల ఆవరణలో ఇంకుడుగుంత నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ కృష్ణమూర్తి, ఎస్‌ఓ ఇందిర, టీఏ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి నరేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ అమృత, కారోబార్ భార్గవి పాల్గొన్నారు.

నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : గణేష శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం భువనగిరిలోని క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్, పోలీస్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఆర్డీఓ కృష్ణారెడ్డితో కలిసి నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షించారు. వినాయకుల నిమజ్జనానికి చెరువుల వద్ద అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం భువనగిరి బైపాస్‌లోని అంబేద్కర్ భవన్‌ను సందర్శించి మౌలిక వసతుల కల్పన పనులను పరిశీలించారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ, అధికారులు, నాయకులు ఉన్నారు.

ఆర్మీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: భారత సైనిక దళం (ఆర్మీ)లో అగ్నివీర్ పథకం కింద టెక్నికల్, క్లర్క్ ఉద్యోగాలకు భారత సైనిక విభాగం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జనవరి 2005 నుంచి జూలై 2008 మధ్య జన్మించి, ఇంటర్/డిప్లొమాలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు agnipathvayu.cdac.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్‌నంబర్ 78391 26939ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

భువనగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే యూరియా కొరత ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం భువనగిరిలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తమ కోటా పూర్తిగా విడుదల చేశామని కేంద్రం చెబుతుందని, కానీ, అందులో 60 శాతం బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్లిందన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు సకాలంలో ఎరువులు అందించడంతో పాటు సాగు, పంటల దిగుబడి అంచనా వేయడంలో పక్కాగా ఉండేదన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైదన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, చిత్రంలో పైళ్ల శేఖర్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ముందంజ

- కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందజేయడమే లక్ష్యమని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్నామని, ఇందుకు ప్రభుత్వ నుంచి ప్రశంసా పత్రం, జిల్లా హౌసింగ్ పీడీ ల్యాప్‌టాప్ అందజేశారని వెల్లడించారు. జిల్లాను ముందు వరుసలో నిలుపడానికి హౌసింగ్, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధుల కృషి ఉందన్నారు. నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి సకాలంలో అందేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాకు రెండు విడతల్లో 9,495 ఇళ్లు మంజూరు కాగా .. 7,730 గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. ఇందులో 4,951 ఇళ్లు బేస్మెంట్ దశ, 387 ఇళ్లు గోడ దశలో, 134 గృహాలు స్లాబ్‌స్థాయిలో ఉన్నట్లు స్పష్టం చేశారు. మొత్తం రూ.44.94 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. మిగతా పనులు కూడా సకాలంలో పూర్తయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు.

యూరియా కోసం రైతుల బారులు



అడ్డగూడూరు సొసైటీ వద్ద లైన్‌లో నిల్చున్న రైతులు



ఆత్మకూర్(ఎం) పీఏసీఎస్ వద్ద..

ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు : ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండల కేంద్రాల్లోని సొసైటీల వద్ద యూరియా కోసం రైతులు బారులుదీరారు. గురువారం ఉదయం ఆత్మకూర్ పీఏసీఎస్‌కు లారీ లోడ్, అడ్డగూడూరు సొసైటీకి 200 బస్తాల యూరియా వచ్చింది. సమాచారం అందుకున్న రైతులు పెద్ద సంఖ్యలో సొసైటీలకు తరలివచ్చి లైన్‌లో నిల్చున్నారు. స్టాక్ తక్కువగా ఉండటం, రైతులు ఎక్కువ సంఖ్యలో రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒక్కో రైతుకు 5నుంచి 10 బస్తాల యూరియా అవసరం ఉన్నప్పటికీ రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. వందలాది మంది రైతులు సాయంత్రం వరకు నిరీక్షించి నిరాశతో వెనుదిరిగారు. వ్యవసాయ పనులు వదులుకొని సొసైటీల చుట్టూ తిరగాల్సి వస్తుందని, సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాప్రభుత్వంలో సొంతింటి కల సాకారం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: గత ప్రభుత్వ హయాంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత వచ్చిన సొంతింటి కల సాకారం అవుతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి నిరుపేదకు గూడు కల్పించాలన్నది సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమన్నారు. పేదోళ్లు ఇళ్లు నిర్మించుకుంటే బీర్ల ఫౌండేషన్ నుంచి సాయం అందజేస్తున్నామని చెప్పారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు అందజేస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేసే దిశగా ప్రజాప్రభుత్వం పథకాలను తీసుకువస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్యారెడ్డి, నాయకులు భిక్షపతిగౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశం, ఎరుకల హేమేందర్, శంకర్ నాయక్, మహేందర్, నరేశ్, హరీష్ పాల్గొన్నారు.

ముసాయిదా జాబితా విడుదల

- మొత్తం ఓటర్లు 5,32,218 మంది
- పోలింగ్ కేంద్రాలు 3,704
- ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాల ప్రదర్శన
- నేడు, రేపు అభ్యంతరాల స్వీకరణ



బస్వాపూర్ పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితాను అంటిస్తున్న కార్యదర్శి

సాక్షి, యాదాద్రి: పరిషత్, పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటరు ముసాయిదా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలను పంచాయతీ అధికారులు గురువారం ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు జిల్లాలో నోటిఫై చేయబడిన 427 గ్రామ పంచాయతీల జాబితాలను వార్డుల వారీగా మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నోటీస్ బోర్డులపై ప్రదర్శించారు. జాబితాలపై ఈనెల 30వ తేదీ వరకు రెండు రోజులు అభ్యంతరాలు స్వీకరిస్తారు. కాగా శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఓటరు, పోలింగ్ ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు, సలహాలు స్వీకరించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు ఇలా.. ముసాయిదా ప్రకారం 427 గ్రామ పంచాయతీల పరిధిలో పోలింగ్ కేంద్రాలు 3,704, ఓటర్లు 5,32,218 మంది ఉన్నారు. పురుషులు 2,64,567, మహిళలు 2,67,649 మంది ఉన్నారు.

అంతటా బీసీ రిజర్వేషన్లపైనే చర్చ
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జోరుగా చర్చ నడుస్తోంది. ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటం, ఇటు హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పూర్తి చేయడం వంటి అంశాలు అధికార పార్టీకి సవాల్‌గా మారాయి. ప్రభుత్వం ఏ విధంగా ముందుకెళ్లందన్న దానిపై చర్చ జరుగుతోంది. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశాన్ని కాంగ్రెస్ పరిశీలనలో ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యే 'సాక్షి'కి తెలిపారు.

మండలాల వారీగా ఓటర్లు

మండలం	పురుషులు	స్త్రీలు	మొత్తం
అడ్డగూడూరు	11,3,20	11,702	23,022
ఆలేరు	10,499	11,033	21,532
ఆత్మకూర్	12,890	12,643	25,533
భువనగిరి	19,592	20,062	39,654
బీబీనగర్	21,299	21,577	42,876
బి.రామారం	14,631	14,872	29,503
పోచంపల్లి	13,733	13,764	27,497
చౌటుప్పల్	19,096	19,405	38,501
గుండాల	13,152	12,917	26,069
మొటకొండూరు	10,495	10,608	21,103
మోత్కూర్	6,528	6,687	13,215
నారాయపురం	20,143	19,953	40,096
రాజాపేట	14,972	15,264	30,236
రామన్నపేట	22,684	22,674	45,358
తుర్కపల్లి	13,846	14,131	27,977
వలిగొండ	26,030	26,401	52,431
యాదగిరిగుట్ట	13,657	13,958	27,615
మొత్తం	**2,64,567**	**2,67,649**	**5,32,218**

ఉపాధ్యాయ ఖాళీల వివరాలు పంపండి

భువనగిరి : ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, సర్దుబాటు, పదోన్నతులు తరువాత ఏర్పడిన ఖాళీల వివరాలు సేకరించి జిల్లా కార్యాలయానికి పంపాలని ఎంఈఓలను డీఈఓ సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎంఈఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన వివరాలను ఏరోజుకారోజు యాప్‌లో నమోదు చేయాలని, ఫేస్ రికగ్నేషన్ హాజరు 100 శాతం ఉండేలా చూడాలన్నారు. ఇంకా 586 మంది విద్యార్థులు, 43 మంది ఉపాధ్యాయులు ఎఫ్ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకోలేదని, వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనలను పరిశీలించి వారికి తగిన సూచనలు చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీ ప్రశాంత్‌రెడ్డి, ఎఎస్‌సీఓ నరహరి, ఎఎంఓ జాన్ అఫ్గన్, సీఎంఓ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



ప్రధానాలయంలో ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు ఆగమ శాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు.వేకుజామును సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, అష్టోత్తరం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ వెండి జోడు సేవలను ఆలయంలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

శివాలయంలో గణపతి పూజ
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో ప్రతిష్ఠించిన వినాయకులకు గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉప ఆలయ మండపంలోని వినాయకుడితో పాటు మట్టి గణపతికి పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అర్చకులు పాల్గొన్నారు.



వినాయకుడికి పూజలు చేస్తున్న అర్చకులు

క్లుప్తంగా

నల్లగొండలో వ్యక్తి దారుణ హత్య

- కుడి కణతపై కొట్టి చంపినట్లు గుర్తించిన పోలీసులు

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుధవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చింతకింది రమేష్ (40) 15 సంవత్సరాల క్రితం నల్లగొండకు వలస వచ్చి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్ మద్యానికి బానిస కావడంతో అతడి భార్య రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా.. బుధవారం రాత్రి కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు రమేష్ మృతిచెంది ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డితో పాటు ఎస్ఐలు సత్యనారాయణ, సైదులు, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడి కణతపై బలంగా కొట్టి చంపినట్లు పోలీసులు గుర్తించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి విద్యార్థి మృతి


మనోహర్ (ఫైల్)

కోదాడరూరల్: స్నేహితులతో కలిసి చెరువులో చేపల వేటకు వెళ్లి విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండలం గణపవరం గ్రామంలో బుధవారం జరిగింది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన కుక్కడపు నాగేశ్వరరావు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య త్రివేణి, కుమారుడు మనోహర్(11) ఉన్నారు. మనోహర్ కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. బుధవారం వినాయకచవితి సెలవు దినం కావడంతో మనోహర్ నలుగురు స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు గ్రామంలోని చెరువు వైపు వెళ్లారు. అందరూ చేపలు పడుతుండగా.. మనోహర్ కాలకృత్యాల కోసమని వెళ్లి చెరువు వద్ద పంట కాల్వ కోసం ఏర్పాటు చేసిన గూనలో ప్రమాదశాత్తు జారిపడి మృతి చెందాడు. మనోహర్ కనిపించకపోవడంతో అతడి స్నేహితులు గ్రామానికి చేరుకుని విషయాన్ని చెప్పారు. మనోహర్ తల్లిదండ్రులు, గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని జేసీబీ సహాయంతో గూనను తవ్వి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వినాయక మండపంలో 'ఆపరేషన్ సిందూర్'

భువనగిరి: భువనగిరి పట్టణంలోని తారకరామనగర్‌లో శ్రీమణికంఠ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆపరేషన్ సిందూర్ థీమ్‌ను పోలిన ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడి, మృతుల కుటుంబ సభ్యుల రోదనలు, త్రివిధ దళాధిపతుల సమావేశం, భారత్ సైన్యం ఉగ్రవాదులను కాల్చి చంపడం వంటి ప్రతిమలను ఒడిషా రాష్ట్రానికి చెందిన కళాకారులచే 25 రోజుల పాటు శ్రమించి తయారు చేశారు. అదేవిధంగా మండపంలో సుమారు 22 అడుగుల మట్టి వినాయక విగ్రహం ప్రతిష్ఠించారు. సుమారు 20 ఏళ్లుగా ప్రతి ఏడాది సందేశాత్మకంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


తారకరామనగర్‌లో శ్రీమణికంఠ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు



వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన ఆపరేషన్ సిందూర్ థీమ్ ప్రతిమలు



గణపతి.. 'ఛత్రి'పతి

మోత్కూరు: వర్షాలు ముంచెత్తుతున్నాయని సింబాలిక్‌గా మోత్కూరు పట్టణంలోని గడిబజార్‌లోని వినాయ మండపంలో నిర్వాహకులు వినాయకుడి చుట్టూ గొడుగులు(ఛత్రిలు) ఏర్పాటు చేశారు. ఇవి చూపరులకు ఆసక్తి కలిగిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏఎస్పీ మృతి

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలంలోని కైతాపురం వద్ద హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై గత నెల 26వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇంటెలిజెన్స్ డీఎస్పీలు ఇద్దరు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఏఎస్పీ కోకా దుర్గా మల్లేశ్వర రామప్రసాద్(58), హెడ్ కానిస్టేబుల్ రెడ్డిచర్ల నరసింహరాజు తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. కాగా చికిత్స పొందుతూ ఏఎస్పీ దుర్గా మల్లేశ్వరరామప్రసాద్ బుధవారం రాత్రి మృతిచెందినట్లు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

ఆచార్య నాగార్జునుడి బోధనలు ఆచరణీయం

- చికాగోలోని బౌద్ధాలయంలో ప్రసంగించిన ఈమని శివనాగిరెడ్డి

నాగార్జునసాగర్: ఆచార్య నాగార్జునుడి బోధనలు నేటికీ ఆచరణీయమని ప్రముఖ బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. అమెరికాలోని చికాగోలో మిడ్ వెస్ట్ అమితాభ బౌద్ధాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఆచార్య నాగార్జునుడి మార్గాలను ఆచరిస్తే ప్రస్తుత సమాజంలోని రుగ్మతలను నిర్మూలించవచ్చని వివరించారు. బుద్ధుడి బోధనలు, నాగార్జునుని తాత్వికతలను ఈ తరానికి అందించి బౌద్ధ సంస్కృతిని పరిరక్షించడానికి నాగార్జునసాగర్‌లో బుద్ధవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. అనంతరం చికాగో-మిడ్‌వెస్ట్ బుద్ధిస్ట్ టెంపుల్ ప్రధానాచార్యులు పూజ్య గ్యాదోకోనో వారి ప్రచురణలను శివనాగిరెడ్డికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో చికాగో సాహితీ మిత్రులు సంస్థ కార్యదర్శి జయదేవ్ మెట్టుపల్లి పాల్గొన్నారు.


తన రచనలను శివనాగిరెడ్డికి అందిస్తున్న మిడ్ వెస్ట్ బౌద్ధాలయం ప్రధానాచార్యులు

మండపంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి


సత్యనారాయణ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: వినాయక మండపానికి టార్పాలిన్ కవర్ కప్పుతుండగా ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని లక్ష్మణ్‌నగర్ కాలనీలో విజేత యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తుండగా.. వినాయక మండపం వేయడానికి అంబేద్కర్ నగర్‌కు చెందిన పోతగల్ల సత్యనారాయణ, గుర్రు కృష్ణ, పెద్దల శ్రీనివాస్ బుధవారం ఉదయం కూలీ పనికి వెళ్లారు. పోతగల్ల సత్యనారాయణ 25 అడుగుల ఎత్తు గల మండపం పైకి ఎక్కి టార్పాలిన్ కవర్ కప్పుతుండగా.. వర్షానికి టార్పాలిన్ కవర్‌పై కాలుపెట్టగానే జారి కిందపడటంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శ్రీలత, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

నిరుపేద అయిన పోతగల్ల సత్యనారాయణ కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు గణేశ్ మండపం వద్ద ధర్నా నిర్వహించారు. చివరికి ఇరువర్గాల పెద్ద మనుషులు కూర్చొని మాట్లాడుకుని.. మృతుడి కుటుంబానికి రూ.4.25లక్షల పరిహారం ఇచ్చేలా అంగీకారం కుదుర్చుకున్నారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన విరమించారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

- ఆటోలో వృద్ధురాలు మర్చిపోయిన బ్యాగు తిరిగి అప్పగింత


వృద్ధురాలికి బ్యాగు అప్పగిస్తున్న ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు

కోదాడరూరల్: వృద్ధురాలు ఆటోలో మర్చిపోయిన బ్యాగును తిరిగి ఆమెకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ ఆటో డ్రైవర్. వివరాలు.. కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్‌లో గురువారం ఓ వృద్ధురాలు కొల్లూరి వెంకటేశ్వర్లు ఆటో ఎక్కి సూర్యాపేట రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్ద దిగింది. ఈ క్రమంలో ఆమె రూ.లక్ష నగదు ఉన్న బ్యాగును ఆటోలోనే మర్చిపోయింది. వెంకటేశ్వర్లు ఆటోను తిప్పుకొని పూల మార్కెట్ వద్దకు వెళ్లిన తర్వాత ఓ వ్యక్తి ఆటో ఎక్కి వెనుక సీట్లో బ్యాగు ఉన్న విషయాన్ని వెంకటేశ్వర్లుకు చెప్పాడు. దీంతో వెంకటేశ్వర్లు యూనియన్ బ్యాంకు వద్దకు వెళ్లి వృద్ధురాలికి బ్యాగు తిరిగి అప్పగించాడు. నిజాయితీ చాటుకున్న వెంకటేశ్వర్లును బ్యాంకు సిబ్బంది, స్థానికులు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


పుష్ప (ఫైల్)

రామన్నపేట: ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటన రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన ఠాకూర్ పుష్ప (68) గ్రామంలో ఒంటరిగా ఉంటుంది. ఆమె పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. చిన్న కుమారుడు నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ నెల 26న పెద్ద కుమారుడితో ఫోన్‌లో మాట్లాడి వినాయకచవితికి హైదరాబాద్‌కు వస్తానని చెప్పింది. రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రించింది. బుధవారం ఉదయం పొద్దుపోయే వరకు తలుపు తీయకపోవడంతో గ్రామానికి చెందిన వ్యక్తి పక్కనే మరో తలుపు వద్దకు వెళ్లి తట్టగా తలుపు తెరుచుకుంది. లోపలికి వెళ్లి చూడగా పుష్ప ముఖంపై రక్తంతో మృతిచెంది ఉంది. దీంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పుష్ప మృతదేహాన్ని పరిశీలించిన కుటుంబ సభ్యులు ఆమె మెడలో పుస్తెలతాడు, చెవి కమ్మలు లేకపోవడం, ముఖంపై రక్తం ఉండడం చూసి పలు అనుమానాలు వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్ఐ డి. నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. క్లూస్‌టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. మృతురాలి కుమారుడు గిరినాథ్‌సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఐదుగురికి గాయాలు

ఖమ్మంరూరల్: ఆగి ఉన్న కంటైనర్ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఐదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 50మంది ప్రయాణికులతో ఖమ్మం నుంచి సూర్యాపేటకు వెళ్తున్న సూర్యాపేట డిపో బస్సు ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఆగి ఉన్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీయించి ఆస్పత్రికి తరలించారు.

బీ-ఫార్మసీ విద్యార్థుల ఫిర్యాదుపై హెచ్‌ఆర్‌సీ విచారణ

- వెంటనే విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీలు ఇవ్వాలని ఆదేశం

రామగిరి (నల్లగొండ): నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో గల వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలకు చెందిన తొమ్మిది మంది బీ-ఫార్మసీ విద్యార్థులు దాఖలు చేసిన ఫిర్యాదుపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం(హెచ్‌ఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదనే కారణంతో కళాశాల యాజమాన్యం తమకు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని విద్యార్థులు సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన కమిషన్.. స్టడీ సర్టిఫికెట్లను నిలిపివేయడం విద్యార్థుల హక్కులను ఉల్లంఘించడమే అని తెలిపింది. సంబంధిత కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ విద్యార్థుల ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, టీసీలు వెంటనే ఇవ్వాలని సిఫారసు చేసింది. కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ వ్యక్తిగతంగా సెప్టెంబర్ 2న కమిషన్ ముందు హాజరుకావాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను కలెక్టర్, తెలంగాణ ఉన్నత విద్యామండలికి పంపిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

సాగర్‌ను సందర్శించిన 23 దేశాల ప్రతినిధులు


నాగార్జునకొండపై మ్యూజియం వద్ద వివిధ దేశాల ప్రతినిధులు

నాగార్జునసాగర్: అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను గురువారం నేపాల్, శ్రీలంక, రష్యా, వియత్నాం, జింబాబ్వే, నైజీరియా, ఇథియోపియా, సౌత్‌సూడాన్‌తో సహా 23 దేశాల నుంచి 27మంది ప్రతినిధులు సందర్శించారు. ఈ నెల 15 నుంచి హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 'నూతన ఆవిష్కరణలు అభివృద్ధి' అనే అంశంపై శిక్షణ పొందుతున్న వీరు టీం కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌కు వచ్చారు. సందర్శనలో భాగంగా లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడ పురావస్తు మ్యూజియం, మాన్యుమెంట్స్‌ను సందర్శించారు. అనంతరం సాగర్ ప్రధాన డ్యాం, బుద్ధవనంలోని పలు ప్రాంతాలను తిలకించారు. మహాస్తూపంలోని రెండవ అంతస్తులోగల ధ్యామందిరంలోని పంచముఖ బుద్ధుని వద్ద ప్రార్థనలు చేశారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ.. నాగార్జునకొండ చారిత్రక విశేషాలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివరాలు, బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరి వెంట డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, పెద్దవూర మండల తహసీల్దార్ రఘు, సాగర్ సీఐ శ్రీనునాయక్, సాగర్ డ్యాం ఈఈ మల్లిఖార్జున్‌రావు, ఏఈ కృష్ణయ్య, బుద్ధవనం అధికారులు శాసన, రవిచంద్ర, ఆర్ఐ దండ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ ముత్తయ్య తదితరులు ఉన్నారు.

వృద్ధురాలిపై దాడి చేసి బంగారం అపహరణ

బీబీనగర్: వృద్ధురాలికి లిఫ్ట్ ఇచ్చిన ద్విచక్ర వాహనదారుడు మార్గమధ్యలో దింపి ఆమెపై దాడికి పాల్పడి మెడలోని బంగారం అపహరించుకుపోయాడు. ఈ ఘటన బీబీనగర్ మండల పరిధిలో బుధవారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండల పరిధిలోని ఇస్రాయిపల్లి కుంటకు చెందిన నెల్లుట్ల భారతమ్మ మంగళవారం తన బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చే క్రమంలో బీబీనగర్‌కు చేరుకుంది. అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో గల ఇస్రాయిపల్లి కుంటకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆమె రోడ్డుపై నిల్చొని అటుగా వస్తున్న గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగింది. బైక్‌పై ఎక్కించుకున్న ద్విచక్ర వాహనదారుడు భారతమ్మను ఇస్రాయిపల్లి కుంట రాకముందే శివారులో దించాడు. అక్కడి నుంచి భారతమ్మ నడుచుకుంటూ వెళ్తుండగా.. సదరు ద్విచక్ర వాహనదారుడు భారతమ్మను రోడ్డు పక్కన చెట్ల పొదల్లో నెట్టివేసి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆమె చేతులతో పాటు మూతిని టవల్‌తో కట్టివేసి నాలుగు తులాల బంగారు చెవి పోగులు, ముక్కుపుడక, గుండ్లను అపహరించకుపోయియాడు. రోడ్డు వెంట వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరకుని వివరాలు సేకరించారు.

మూసీకి పోటెత్తిన వరద

- ఎనిమిది గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

కేతేపల్లి: హైదరాబాద్‌తో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీ, బిక్కేరు వాగుల ద్వారా మూసీ ప్రాజెక్టుకు వరద పెరిగింది. దీంతో గురువారం ప్రాజెక్టు ఎనిమిది గేట్లను పైకెత్తి 10,594 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం సాయంత్రం వరకు మూసీకి 8,857 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 643.50 అడుగుల మేర నీటిమట్టం ఉంది. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 239 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 4.46 టీఎంసీల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 4.06 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.


మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకుపోతున్న నీరు



ఉద్యాన పంటల్లో 'పండు ఈగ'- నివారణ చర్యలు

గుర్రంపోడు: గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవలి కాలంలో పండ్ల తోటలు, కూరగాయల తోటలు సాగు చేసే రైతులకు పండు ఈగ పురుగు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఉద్యాన పంటల్లో పండు ఈగ పురుగు నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు శ్రీకొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ సురేష్‌కుమార్ మాటల్లో..

- ఒకప్పుడు వర్షాకాలం మొదలైన తర్వాత కొద్దిరోజులు మాత్రమే మామిడి కాయల్లో పండు ఈగ పురుగు కనిపించేది. ఇప్పుడు సీజన్‌తో సంబంధం లేకుండా సంవత్సరమంతా అన్నిరకాల పండ్ల తోటలకు పండు ఈగ పురుగు సోకి 30 నుంచి 50 శాతం వరకు దిగుబడికి నష్టం చేస్తోంది. జామ కాయల్లో ఈ పురుగు ఉధృతి మరీ ఎక్కువగా ఉంది.
- పండు ఈగ మామడి, జామ, సీతాఫలం, అరటి, బొప్పాయితో పాటు కాకర, అనప, పొట్లకాయ, దోస లాంటి తీగజాతి కూరగాయల్లో కూడా కనిపిస్తుంది.

ఇలా గుర్తించాలి..

పండు ఈగ ఆశించిన కాయలకు ఉన్న రంధ్రాలను(సూదితో గుచ్చినట్లుగా) బట్టి గుర్తించవచ్చు. ఇలాంటి కాయలను కోసి చూస్తే అందులో పిల్ల పురుగుల కనిపిస్తాయి. ఈ కాయలు తర్వాత దశలో శిలీంధ్రం ఆశించి కుళ్లిపోతాయి. పిల్ల పురుగులు కాయల నుంచి బయటకు వచ్చి కోశస్థ దశలో గడుపుతాయి. ఆ తర్వాత ఇవి వ్యాప్తి చెంది కాయలను ఆశించి ఉధృతిని పెంచుకుంటాయి. పండ్ల జాతి పంటల్లో పండు ఈగ నివారణకు మిథైల్ యుజినాల్ ఎరలను, కూరగాయ పంటల్లో క్యూలూర్ అనే ఎరలను ఉపయోగించాలి.


జామకాయలపై పండు ఈగ చేసిన రంధ్రాలు

పండ్ల తోటల్లో..

గతంలో వర్షాకాలం మొదలైన తర్వాత మామిడి తోటల్లో చెట్టుపైన ఉన్న కాయలకు ఈ పండు ఈగ ఆశించేది. ఈ మధ్య కాలంలో జామ, సీతాఫలంలో ఈ పురుగు ఉధృతి పెరిగింది. జామ కాయలు పరిపక్వతకు వచ్చే సమయంలో ఈ పురుగు ఆశించి పదునైన సూది లాంటి పరికరంలో గుచ్చినట్లుగా కాయపై రంధ్రాలు చేసి గుడ్లు పెడుతుంది. ఆ గుడ్లు అందులో పొదిగి పరిపక్వత చెంది లోపల మ్యాగట్స్‌గా అభివృద్ధి చెందుతాయి. తర్వాత ఇవి పండు లోపల గుజ్జును తినేస్తాయి. పండు ఈగ ఆశించిన పండ్లు తొందరగా మగ్గిపోతాయి. రెండో దశలో పండ్లు రాలిపోయి, వాటిలోని పిల్ల పురుగులు భూమిలోకి వెళ్లి కోశస్థ దశ గడిపి తల్లి ఈగలు బయటకు వచ్చి మరలా వచ్చే కొత్త దిగబడులను ఆశించి ఉధృతిని పెంచుకుంటాయి. పండు ఈగ నివారణకు ప్రధానంగా కలపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. పాదులను శుభ్రం చేసి పారతో మట్టిని కదిలించాలి. దీనివలన ఎండకు కోశస్థ దశలోని పురుగులు ఎండకు చనిపోతాయి. ఆ తర్వాత చెట్టుకు 20 నుంచి 40 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకోవాలి. లింగాకర్షణ బుట్టలను ఎకరాకు పది నుంచి 15 అమర్చుకుని పురుగు ఉధృతిని గమనించవచ్చు. ఒక్కో బుట్టలో 40 పురుగులు పడినట్లయితే ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు, 10 నుంచి 15 పురుగులు పడినట్లయితే ఉధృతి మధ్యస్థంగా ఉన్నట్లు, 4 కంటే తక్కువ పురుగులు పడినట్లయితే ఉధృతి తక్కువగా ఉన్నట్లు గమనించుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే మలాథియాన్ 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలుపుకుని 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.

కూరగాయ పంటల్లో..

బీర, కాకర, సోర, దోస, పుచ్చ వంటి తీగజాతి పంటల్లో పిందె రాకముందే నల్లగా మాడిపోయి రాలిపోతాయి. పెరుగుతున్న పిందెలు వంకరగా మారుతాయి. పండు ఈగ నివారణకు ఎకరాకు 8 వరకు లింగాకర్షణ బుట్టలు పెట్టడం వల్ల మగ ఈగలను ఆకర్షించడంతో పాటు వాటి ఉధృతిని తెలుసుకోవచ్చు. ఎరలను పిందె దశ నుంచి ఏర్పాటు చేసుకుంటే దిగుబడి పూర్తయ్యే వరకు పనిచేస్తుంది. భూమిని బాగా దున్నడం వల్ల వాటిలో ప్యూపాలు బయటకు వచ్చి ఎండకు చనిపోవడం, పక్షులు తినడం జరుగుతుంది. దీని వల్ల తర్వాతి తరం పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు. పండు ఈగ నివారణకు సాయంత్రం పూట మలాథియాన్ అనే మందును 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి వేప నూనె పది వేల పీపీఎంతో కలిపి పిచికారీ చేసుకోవాలి.